



సమావేశంలో మాట్లాడుతున్న గోపాల్‌నాయక్

సమస్యల పరిష్కారానికి టీఎస్‌యూటీఎఫ్ కృషి

జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్

కడ్తాల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యల పరిష్కారానికి టీఎస్‌యూటీఎఫ్ నిర్విరామంగా కృషి చేస్తుందని జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కడ్తాల్ మండల విద్యావనరుల కేంద్రంలో శుక్రవారం యూటీఎఫ్ మండల మహాసభ నిర్వహించారు. విద్యారంగ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా గోపాల్‌నాయక్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బకాయిలు, డీఏలు, నూతన పీఆర్‌సీని సాధించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ ఏడాది చివరి నాటికి హెల్త్ కార్డులు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో అధ్యక్షుడు జంగయ్య, ఎంఈవో నిర్మల, జిల్లా కార్యదర్శి శంకర్ నాయక్, జిల్లా నాయకులు రఘుపాల్, రవీందర్‌రెడ్డి, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

మండల నూతన కమిటీ ఏర్పాటు

యుటీఎఫ్ కడ్తాల్ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జంగయ్య, ప్రధాన కార్యదర్శిగా కృష్ణ, ఉపాధ్యక్షులుగా మల్లయ్య, కౌస్య, కార్యదర్శులుగా భీముడు, విజయ్‌కుమార్, సరోజిని, శ్రీనివాస్‌గౌడ్, దివ్య ఎన్నికయ్యారు.





పంచాయతీకి రియల్ పోరు

అమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల్లో సర్పంచ్ పదవుల కోసం తీవ్ర పోటీ నెలకొంది. రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగే ఈ ప్రాంతంలో ఎలాగైనా సర్పంచ్ పదవి దక్కించుకోవాలని ఆశావహులు చూస్తున్నారు. ఇక్కడి పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు రియల్టర్లు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. వీరే కాకుండా వ్యాపారులు, యువకులు ఎన్నికల బరిలో నిలిచేందుకు సిద్ధమవుతున్నారు. అయితే నామినేషన్ల పర్వం మొదలు కాకముందే ఓటర్లను మచ్చిక చేసుకునే పనిలో వీరు నిమగ్నమయ్యారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో విందు వినోదాలకు లక్షలు ఖర్చు చేస్తున్నారు. ఎన్నికల్లో వీరు ఎంత ఖర్చయిన చేసి సర్పంచ్ పదవి దక్కించుకునేందుకు బరిలో నిలుస్తున్నారు. దీంతో జనంలో ఉన్న స్థానిక నాయకులు బెంబేలెత్తుతున్నారు. ఈ ధన ప్రవాహాన్ని తట్టుకోవాలంటే వారు ఆస్తులు తాకట్టు పెట్టడం లేదా, అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

ఎన్నికల బరిలోకి రియల్టర్లు, వ్యాపారులు

- సర్పంచ్ కుర్చీ కోసం పల్లెబాట
- రూ.కోట్లు ఖర్చుకు సిద్ధమవుతున్న ఆశావహులు
- నామినేషన్ల ప్రారంభానికి ముందే జోరుగా ఖర్చు
- ధన దాటికి బెంబేలెత్తుతున్న స్థానిక నేతలు
- పోటీని తట్టుకునేందుకు ఆస్తుల తాకట్టు



అమనగల్లు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నామినేషన్లకు ముందే పల్లెల్లో పంచాయతీ సమరం వేడెక్కుతోంది. సర్పంచ్ పీఠం కోసం అన్ని పార్టీలలో పోటీ తీవ్రంగా ఉంది. సర్పంచ్ గిరిని చేజిక్కించుకునేందుకు లక్షల రూపాయలు వెచ్చించేందుకు ఆశావహులు సిద్ధమవుతున్నట్లు సమాచారం. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు చేరువలో ఉండి, రియల్ ఎస్టేట్ ప్రభావం ఉన్న ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల మండలాల పరిధిలో పంచాయతీ ఎన్నికలపై రియల్ ఎస్టేట్ ప్రభావం అప్పుడే కనిపిస్తోంది. సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేసేందుకు ఆశావహులు సిద్ధమవుతున్నారు. అప్పుడే కొన్నిచోట్ల ఓటర్లను తమ వైపు తిప్పుకోవడానికి డబ్బు ఖర్చు చేయడం ప్రారంభించారు. జనరల్ స్థానాలు కలిసి రావడం, ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేయడంతో

మిగతా 8వ పేజీలో...


గ్లోబల్ సమ్మిట్ పనులను పరిశీలిస్తూ అధికారులకు సూచనలు ఇస్తున్న ఫ్యూచర్‌సిటీ అథారిటీ ఎండీ శశాంక, కలెక్టర్ నారాయణరెడ్డి

గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు ముమ్మరం చేయాలి

ఫ్యూచర్‌సిటీ అథారిటీ ఎండీ శశాంక, కలెక్టర్ నారాయణరెడ్డి

కందుకూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం డిసెంబరు 8, 9వ తేదీలలో కందుకూరు మండలం మీర్కాన్‌పేటలో ఏర్పాటు చేయనున్న రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025 పనులను మరింత ముమ్మరంగా చేపట్టాలని ఫ్యూచర్‌సిటీ అథారిటీ ఎండీ శశాంక, కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. శుక్రవారం సమ్మిట్ నిర్వహించే ప్రదేశంలో వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో వారు మాట్లాడారు. అంతర్జాతీయ, జాతీయస్థాయి పెట్టుబడుదారులు, పారిశ్రామికవేత్తలు ఈ సమ్మిట్‌కు రానున్న నేపథ్యంలో అందుకు తగిన ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా తాగునీటి వసతులు, విద్యుత్, రోడ్ల ఏర్పాట్లపై నిర్లక్ష్యం చేయొద్దని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమ్మిట్‌కు వచ్చే ప్రతినిధులకు, పార్కింగ్, బస, మూడు హెలిప్యాడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు గుర్తు చేశారు.

బందోబస్తుపై రాచకొండ సీపీ సూచనలు

గ్లోబల్ సమ్మిట్‌కు వచ్చే ప్రతినిధులకు బందోబస్తు ఏర్పాటులో ఎలాంటి నిర్లక్ష్యం చేయరాదని రాచకొండ సీపీ సుధీర్‌బాబు పోలీసు ఉన్నతాధికారులకు సూచించారు. శుక్రవారం సమ్మిట్ ప్రదేశంలో పోలీసు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచలను ఇచ్చారు. కార్యక్రమంలో ఐఏఎస్ అధికారులు గౌతమ్, ముష్రఫ్‌అలీ, వెంకట్ నర్సింహ్మారెడ్డి, రమేష్, అశోక్‌రెడ్డి, మహేశ్వరం డీసీపీ కె.నారాయణరెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, చీఫ్ ఇంజనీర్ రవి, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ జ్యోతి, తహసీల్దార్ కె.గోపాల్ పాల్గొన్నారు.

కొత్త విత్తన చట్టం- 2025పై అభిప్రాయ సేకరణ



అభిప్రాయ సేకరణలో జిల్లా వ్యవసాయాధికారి ఉష

ఇబ్రహీంపట్నం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కొత్త విత్తన చట్టం-2025 తేవాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినందున ముసాయిదాపై రైతుల అభిప్రాయాన్ని సేకరిస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి ఉష తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖలతో జరిగిన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో వినూత్న మార్పులు తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం యోచిస్తోందన్నారు. నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించినప్పుడే అధిక దిగుబడులు వస్తాయని, అందుకు తగిన పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. డాట్ సెంటర్ శాస్త్రవేత్త మధుశేఖర్ నూతన ముసాయిదా విత్తన బిల్లుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సురేష్, కేవీకే శాస్త్రవేత్త డాకృష్ణ, ఇతర జిల్లా అధికారులు, రైతులు, విత్తన డీలర్లు, ఎన్జీవోలు పాల్గొన్నారు.

రెండో రోజూ అదే జోరు

నామినేషన్లు వేసేందుకు పలుచోట్ల బారులు

- సర్పంచ్ స్థానాలకు 203 నామినేషన్లు
- వార్డులకు 688 నామినేషన్లు
- తొలిదశ నామినేషన్లకు నేడే ఆఖరు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : జిల్లాలో తొలి విడత పంచాయతీ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ నేడు ముగియనుంది. జిల్లాలోని ఏడు మండలాల పరిధిలోని 174 పంచాయతీలు, 1530 వార్డుల ఎన్నికలకు సంబంధించి గురువారం నోటిఫికేషన్ విడుదలైన సంగతి తెలిసిందే. రెండో రోజు సర్పంచ్, వార్డు పదవులకు నామినేషన్లు వేసేందుకు నేతలు పోటీపడ్డారు. పలుచోట్ల నామినేషన్లు వేసేందుకు క్యూ కట్టడం గమనార్హం. రెండో రోజు జిల్లా వ్యాప్తంగా సర్పంచ్ స్థానాలకు 203 నామినేషన్లు దాఖలు కాగా, వార్డు స్థానాలకు 688 నామినేషన్లు వచ్చాయి. ఇప్పటివరకు సర్పంచ్ స్థానాలకు 349 నామినేషన్లు దాఖలు కాగా, వార్డు స్థానాలకు 810 నామినేషన్లు వచ్చాయి. సర్పంచ్ స్థానాలకు ఫరూఖ్‌నగర్ మండలంలో అత్యధికంగా 89 నామినేషన్లు రాగా, అతి తక్కువగా కొత్తూరు మండలంలో 29 నామినేషన్లు వచ్చాయి. అలాగే శంషాబాద్ మండలంలో అత్యధికంగా వార్డు స్థానాలకు 200 నామినేషన్లు వచ్చాయి. జిల్లెల


నందిగామ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న మాజీ సర్పంచ్ కొమ్ము కృష్ణ

చౌదరిగూడెం మండలంలో అతి తక్కువగా వార్డులకు 52 మాత్రమే నామినేషన్లు వచ్చాయి. నామినేషన్ల స్వీకరణ నేటితో ముగియనుండడంతో చివరి రోజు భారీగా నామినేషన్లు దాఖలయ్యే అవకాశం ఉంది. ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించేందుకు జనరల్ అబ్జర్వర్ ప్రశాంత్ జీవన్, కలెక్టర్ నారాయణరెడ్డి శంషాబాద్ మండలంలో పర్యటించారు.

రెండో రోజు నామినేషన్ల వివరాలు

మండలం	పంచాయతీలు	నామినేషన్లు	వార్డులు	నామినేషన్లు
ఫరూఖ్‌నగర్	47	55	410	113
జిల్లెల చౌదరిగూడెం	24	18	204	47
కేశంపేట	29	35	260	100
కొత్తూరు	12	17	110	80
కొందుర్గు	22	22	186	63
నందిగామ	19	24	170	96
శంషాబాద్	21	32	190	169

సాంకేతిక లోపంతో ఇండిగో విమానం రద్దు

శంషాబాద్ రూరల్, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి) : వడోదర నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు రావాల్సిన ఇండిగో 6ఈ 2179 విమానం సాంకేతిక లోపంతో రద్దయింది. వివరాల్లోకి వెళితే.. వడోదర నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వస్తున్న 6ఈ 2179 ఇండిగో విమానం సాయంత్రం 5.30 గంటలకు బయలుదేరి రాత్రి 7.10 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు రావాలి. కానీ సాంకేతిక లోపం తలెత్తడంతో ఎయిర్‌లైన్స్ అధికారులు విమానాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో హైదరాబాద్ రావాల్సిన ప్రయాణికులు ఆందోళన చేపట్టారు. ఎయిర్‌లైన్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అదే విమానం తిరిగి వడోదర వెళ్లాల్సి ఉండగా, అది కాస్త రద్దు కావడంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కూడా ప్రయాణికులు ఆందోళన చేపట్టారు. ఇతర విమానాల ద్వారా ప్రయాణికులను శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు తరలిస్తున్నట్లు ఎయిర్‌లైన్స్ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నట్లు తెలుస్తోంది.

ప్రజలను జాగృతం చేయాలి

8

మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

న్యాయమైన పరిహారం ఇస్తేనే మా భూములిస్తాం

- అధికారులకు తేల్చి చెప్పిన రైతులు
- ఆకుతోటపల్లి, సాకిబండ తండాలలో గ్రామ సభలు
- హాజరైన అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ రాజు


వినతి పత్రం అందజేస్తున్న రైతులు, నాయకులు

ఆమనగల్లు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డుకు భూములు కోల్పోతున్న తమకు న్యాయమైన పరిహారం అందించాలని అధికారులను రైతులు కోరారు. అవకాశం ఉంటే అలైన్‌మెంట్‌ను ప్రభుత్వ భూముల మీదుగా మార్చి తమకు అన్యాయం జరుగకుండా చూడాలని అభ్యర్థించారు. ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి, సాకిబండ తండాలలో శుక్రవారం గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డుకు భూములు కోల్పోతున్న రైతులతో రెవెన్యూ అధికారులు గ్రామ సభలు నిర్వహించారు. తహసీల్దార్ ఫయ్యాజ్‌ఖాద్రీ అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభలకు అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆకుతోటపల్లి గ్రామస్తులు ఎకరాకు రూ.కోటి, ప్లాట్.. సాకిబండ తండా రైతులు ఎకరాకు రూ. 1.50కోట్లు, ఫోర్త్‌సిటీలో 500 గజాల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే భూమికి బదులు భూమి ఇప్పించాలని కోరారు. భూ నిర్వాసితులకు ఎకరానికి రూ.30లక్షల పరిహారం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని అదనపు కలెక్టర్ తెలిపారు. రైతుల డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని ఆయన తెలిపారు. న్యాయమైన పరిహారం ఇస్తేనే తాము భూములు ఇస్తామని సాకిబండ తండాలో కొందరు రైతులు గ్రామసభ నుంచి వెళ్లిపోయారు. సీఐ జానకిరాంరెడ్డి, ఎస్‌ఐలు వెంకటేశ్, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

మైసిగండి హుండీ ఆదాయం రూ.15.16 లక్షలు



కడ్తాల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ దేవాలయంలో శుక్రవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ రామావత్ సిరోలిపంతూ, ఈవో స్నేహలత, జిల్లా దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌కుమార్‌ల సమక్షంలో హైదరాబాద్ వీజీఎల్ అన్నపూర్ణ సేవా సమితి బృందం హుండీలను లెక్కించారు. 92 రోజులకు గాను రూ. 15,16,435 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో తెలిపారు. ఈ ఆదాయాన్ని ఆలయ బ్యాంకు ఖాతాలో జమచేసి అభివృద్ధి పనులు, భక్తులకు సదుపాయాల కల్పనకు ఖర్చు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీ భాస్కర్, అరుణ్, యాదగిరి, చంద్రయ్య, కృష్ణ, రాములు, శ్రీనివాస్, పత్యానాయక్, శ్రీనివాసులు, హర్షవర్ధన్‌రెడ్డి, వెంకటేశ్, బీబీచారి, శ్రీను, కెనరా బ్యాంక్ అధికారి రాజేశ్‌కుమార్, రాజు పాల్గొన్నారు.

'ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి'

శంకర్‌పల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ కోరారు. శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వెంకయ్యగౌడ్ అధ్యక్షతన శుక్రవారం ఎన్నికల కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 24 గ్రామ పంచాయతీలకు ఈనెల 30వ తేదీ నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించేందుకు ఎనిమిది క్లస్టర్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చని వివరించారు. డిసెంబరు 3న నామినేషన్ల పరిశీలన, 6న ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. అనంతరం పోటీలో ఉండే అభ్యర్థులకు గుర్తులను కేటాయిస్తామన్నారు. డిసెంబరు 14న ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఓటింగ్ జరుగుతుందని తెలిపారు. అదేరోజు మధ్యాహ్నం 2గంటల నుంచి ఓట్ల లెక్కింపు నిర్వహించి, అనంతరం ఉపసర్పంచ్ ఎన్నిక ఉంటుందన్నారు. నామినేషన్ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాలు, ఓట్ల లెక్కింపు కేంద్రాలలోకి మొబైల్ ఫోన్లను తీసుకెళ్లరాదని సూచించారు. నార్సింగి ఏసీపీ రమణగౌడ్, ప్రత్యేకాధికారి సురేష్‌బాబు, శంకర్‌పల్లి తహసీల్దార్ సురేందర్, సీఐలు శ్రీనివాస్‌గౌడ్, వీరబాబు, ఎంపీవో గిరిరాజ్, ఉప తహసీల్దార్ బాలక్రిష్టారెడ్డి ఉన్నారు.

మా సాగు భూముల్లో రోడ్డు నిర్మాణం చేపట్టొద్దు

- మీర్కాన్‌పేటలో అధికారులను అడ్డుకున్న బేగరికంచ రైతులు
- మద్దతు తెలిపిన సీపీఎం నాయకులు


మీర్కాన్‌పేటలో రోడ్డు పనులను అడ్డుకుంటున్న రైతులు, సీపీఎం నాయకులు

కందుకూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మీర్కాన్‌పేటలో ఏర్పాటు చేస్తున్న గ్లోబల్ సమ్మిట్ నుంచి స్కిల్ యూనివర్సిటీ వరకు నూతనంగా ఏర్పాటు చేస్తున్న రోడ్డు నిర్మాణ పనులను బేగరికంచ రైతులు శుక్రవారం అడ్డుకున్నారు. రైతుల ఆందోళనకు సీపీఎం నేతలు మద్దతు తెలిపారు. మీర్కాన్‌పేట రెవెన్యూ పరిధిలోని 120 సర్వే నెంబర్‌లోని 654 ఎకరాల ప్రభుత్వ భూములను 2016 సంవత్సరంలో గత ప్రభుత్వం టీఎస్‌ఐఐసీ ద్వారా సేకరించింది. ఇందుకు పరిహారంగా ఎకరాకు రూ7లక్షల 50వేలు రైతులకు అందజేశారు. గత 14రోజులుగా 120 సర్వే నెంబర్‌లో డిసెంబర్ 8, 9వ తేదీలలో గ్లోబల్ సమ్మిట్‌ను ఏర్పాటు చేయడానికి ఏర్పాట్లు ముమ్మరం చేశారు. గ్లోబల్ సమ్మిట్ నుంచి స్కిల్ యూనివర్సిటీ వరకు గత రెండు రోజులుగా రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. 145 సర్వే నెంబర్‌లో ఉన్న దేవుని భూముల్లో రోడ్డు పనులు చేయిస్తున్న అధికారులను సాగులో ఉన్న రైతులు డిల్లీ కృష్ణ, డి.నర్సింహ్మా, డి.భూపాల్, శిరారాజ్, డి.లక్ష్మయ్య, డి.నర్సింహ్మా, డి.క్రిష్ణ, డి.వెంకటేష్, చంద్రకళ, డి.లక్ష్మయ్యలు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న సీపీఎం మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్, పార్టీ జిల్లా సభ్యులు డి.రాంచందర్ వారికి మద్దతు పలికారు. తాతల కాలం నుంచి సాగులో ఉన్న తమ భూముల నుంచి రోడ్డు ఎలా వేస్తారని నిలదీశారు. వెంటనే అధికారులు రోడ్డు పనులను ఆపేయాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ కె.గోపాల్, మహేశ్వరం డీసీపీ కె.నారాయణరెడ్డి రైతులతో చర్చలు జరిపి వారిని శాంతింప జేశారు.

చౌడాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన

చౌడాపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను గృహ నిర్మాణ శాఖ ఏఈ నవీన్ శుక్రవారం పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను చేపట్టాలన్నారు. మండలానికి 307 ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు.

కాంగ్రెస్ మోసాలను ఎండగట్టాలి

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తల్లోజు ఆచారి


మాట్లాడుతున్న తల్లోజు ఆచారి

ఆమనగల్లు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలు, వైఫల్యాలు ఎండగట్టి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ మద్దతిచ్చిన అభ్యర్థుల విజయం కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, ఎస్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి పిలుపునిచ్చారు. ఆమనగల్లు పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం బీజేపీ మండల అధ్యక్షుడు ఎర్రవోలు శ్రీను అధ్యక్షతన నిర్వహించిన పార్టీ మండల కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి హాజరయ్యారు. పంచాయతీ ఎన్నికలు, పార్టీ బలోపేతం, సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థుల ఎంపికపై చర్చించారు. పంచాయతీ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో విజయం సాధించి కల్వకుర్తి నియోజకవర్గంలో బీజేపీ సత్తా చాటాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారెంటీల అమలుపై ఎన్నికల ప్రచారానికి గ్రామాలకు వచ్చే కాంగ్రెస్ నాయకులను ప్రజలు నిలదీయాలన్నారు. బీఆర్ఎస్ ప్రజా విశ్వాసం కోల్పోయిందని, గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పీటీసీ కండె హరిప్రసాద్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోరటి నర్సింహ, జిల్లా కౌన్సిల్ సభ్యుడు చెక్కాల లక్ష్మణ్, సింగం శ్రీనయ్య, నాయకులు లక్ష్మణ్ రావు, శ్రీనివాస్, శ్రీను,మహేశ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో అన్ని వసతులు కల్పిస్తాం


మాట్లాడుతున్న అమెజాన్ సంస్థ ప్రతినిధి జాన్‌నోబెల్

యాచారం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పాఠశాలకు అన్ని రకాల వసతులు కల్పించడానికి తమ వంతు సహకారమందిస్తామని అమెజాన్ సంస్థ ఆస్ట్రేలియా ప్రతినిధి జాన్‌నోబెల్ అన్నారు. శుక్రవారం యాచారం మండలంలోని నందివనపర్తి ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అమెజాన్ స్టీమ్ ల్యాబ్ ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు లక్ష్యం పెట్టుకొని చదవాలని, నిర్దేశించుకున్న లక్ష్యం చేరడానికి ఉపాధ్యాయుల బోధన అందించాలన్నారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి గ్రూప్ ఫొటో తీసుకున్నారు. కార్యక్రమంలో అమెజాన్ సంస్థ స్థానిక ఉద్యోగులు లత, రాము, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరామశాస్త్రి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నేతలు


ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

శంషాబాద్ రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సుల్తాన్‌పల్లికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు మాజీ సర్పంచ్‌లు దండు ఇస్తారి, యాటకారి సిద్దేశ్వర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్ ముదిరాజ్, సుధాకర్, నరసింహ, శేఖర్‌తో పాటు మరికొంత మంది బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లయ్య, మల్లికార్జున్, వెంకటయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ఎన్నారై హైమద్‌షరీఫ్, చిత్రంలో మంత్రి అజారుద్దీన్ మాజీ ఎంపీ హనుమంతరావు, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

టీపీసీసీ చీఫ్‌కు ఘన సన్మానం

శంషాబాద్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ రాజకీయాల్లో ఎంతో ఎత్తుకు ఎదిగారని ఫస్ట్‌ద్యాయెల్ సిటిజన్ అవార్డు గ్రహీత, స్థానిక ఎన్నారై ఇష్తెకార్‌హైమద్ షరీఫ్ అన్నారు. శంషాబాద్‌లోని తన నివాసంలో తన తన స్నేహితుడైన మహేశ్‌కుమార్‌గౌడ్‌తో పాటు మంత్రి అజారుద్దీన్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌తో పాటు రాజ్యసభ మాజీ సభ్యుడు హనుమంత్‌రావులను శుక్రవారం పూలమాలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ భారతదేశంలో మతపరమైన విబేధాలుండవన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులు 90 శాతం కంటే ఎక్కువ స్థానాల్లో గెలుపొందుతుందని ధీమావ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేందర్‌రెడ్డి, దూడల వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

టెట్ నుంచి మినహాయింపునివ్వాలి

టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటప్ప

షాబాద్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): 2010 కంటే ముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపునివ్వాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప డిమాండ్ చేశారు. షాబాద్‌లో శుక్రవారం సంఘం మండల మహాసభలు శేఖర్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలకు హాజరైన జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప మాట్లాడుతూ.. ఎన్‌సీటీఈ నోటిఫికేషన్ 23 ఆగస్టు 2010 కంటే ముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. 30 ఏళ్లకు పైబడి సర్వీస్ చేసిన ఉపాధ్యాయులను రెండు సంవత్సరాల్లో టెట్ పాస్ కావాలని, లేని పక్షంలో ఉద్యోగం తొలగిస్తామని చెప్పడంతో ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక

టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా శేఖర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా నర్సింహులు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా సురేష్, మహిళా ఉపాధ్యక్షురాలిగా షహనాజ్, కోశాధికారిగా నయ్యర్, కార్యదర్శులుగా సుగుణ, స్వప్న, నర్సింహులు, హేమసుందర్, సంతోష్‌కుమార్, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్ అశోక్‌కుమార్, వీవోటీటీ కన్వీనర్‌గా నరేష్, ఆడిట్ కన్వీనర్‌గా కృపాకర్, క్రీడా కన్వీనర్‌గా రాజేశ్వరమ్మ, సాంస్కృతిక కన్వీనర్‌గా నర్సింహులు, పత్రిక కన్వీనర్‌గా జంగారెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి


ఇందిరమ్మ కాలనీలో ఆందోళన చేస్తున్న స్థానికులు

శంషాబాద్ రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని తొండుపల్లి ఇందిరమ్మ కాలనీలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను కొందరు కబ్జా చేస్తున్నారని పలువురు స్థానికులు శుక్రవారం ఆందళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఆర్ఐ కృష్ణ ఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు నచ్చజెపే ప్రయత్నం చేశారు. కబ్జా చేసి ఇళ్ల నిర్మాణం చేపట్టిన అక్రమార్కులపై చర్యలు తీసుకునే వరకూ మా పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఇళ్లు లేని పేదలు ఎంతో మంది ఉన్నారని, వారికి కాకుండా బిల్డింగ్‌లు కట్టుకున్న వారికి తిరిగి ప్లాట్లు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. రెవెన్యూ అధికారులు స్పందించకుంటే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కబ్జా జరిగినట్లు తేలితే కఠిన చర్యలు తప్పవని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆర్ఐ హెచ్చరించారు. సోమవారం తహసీల్దార్‌తో కలిసి దర్యాప్తు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

గుప్త నిధుల వేట.. ఎనిమిది మంది అరెస్టు

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపిన ఎనిమిది మందిని పోచారం ఐటీ కారిడార్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. పోచారం ఇన్ఫోసిస్ సమీపంలోని నిర్మానుష్య ప్రదేశంలో గుప్త నిధుల కోసం గుంతలు తవ్వుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా ఎనిమిది మంది యువకులు గుంతలు తవ్వుతూ కనిపించారు. ఆ గుంతల వద్ద కొబ్బరికాయలు, నిమ్మకాయలు కనిపించాయి. దీంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించగా గుప్త నిధుల కోసం తవ్వుతున్నట్లు తెలిపారు. కీసర మండలం రాంపల్లికి చెందిన గడిపల్లి మహేష్(3), గొలుసుల అజయ్(19), మిరియాల ప్రశాంత్(19), అమ్మనమంచి హర్ష(24), బీనగోని శివ(21), ఉర్సు శివ(19), బొక్క విష్ణువర్దన్‌రెడ్డి(20), బీగుడం అరవింద్(30)ను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఎర్టిగ కారు, గవ్వలు, పూజా సామగ్రి, రెండు బైక్‌లు, ఎనిమిది సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.




26 వార్డుల్లో ఎస్సీలకు నో చాన్స్



మొయినాబాద్ రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో మొత్తం 19 గ్రామ పంచాయతీలు ఉండగా 30,250 మంది ఓటర్లు ఉన్నారు. చేవెళ్ల డివిజన్ పరిధిలో రెండో విడత డిసెంబరు 14న పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదలైంది. అయితే మండలంలోని మూడు పంచాయతీల్లో సర్పంచ్ పదవులతోపాటు మొత్తం 26 వార్డుల్లో ఎస్సీలకు ఒక్క వార్డు కేటాయించలేదు. ఇందులో కాశీంబౌళి, చందానగర్, కేతిరెడ్డిపల్లి ఉన్నాయి.

- కాశీంబౌళి సర్పంచ్ స్థానం జనరల్‌కు కేటాయించారు. ఎనిమిది వార్డుల్లో నాలుగు జనరల్, నాలుగు బీసీలకు కేటాయించారు. ఇందులో ఒక్క వార్డుకూడా ఎస్సీలకు కేటాయించలేదు. గ్రామంలో 994 ఓటర్లు ఉండగా ఎస్సీలు 25 మంది వరకు ఉంటారు.
- చందానగర్ పంచాయతీ సర్పంచ్ స్థానం జనరల్ అభ్యర్థులకు కేటాయించారు. ఎనిమిది వార్డులు ఉండగా నాలుగు జనరల్, నాలుగు బీసీలకు కేటాయించారు. గ్రామంలో 990 ఓటర్లు ఉండగా ఒక్క వార్డు కూడా ఎస్సీలకు కేటాయించలేదు. ఈ గ్రామంలో ఎస్సీ ఓటర్లు లేరు.
- కేతిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానం బీసీ అభ్యర్థులకు కేటాయించారు. పది వార్డులు ఉండగా ఐదు జనరల్, ఐదు బీసీలకు కేటాయించారు. గ్రామంలో 2,625 ఓటర్లు ఉండగా ఈ గ్రామంలో కూడా ఒక్క వార్డు కూడా ఎస్సీలకు కేటాయించలేదు. ఈ గ్రామంలో ప్రస్తుతం 317 మంది ఎస్సీ ఓటర్లు ఉన్నారు. ఈ విషయంపై మొయినాబాద్ ఎంపీడీఓ సంధ్యారాణిని వివరణ కోరగా డెడికేట్ కమిషన్ ఇచ్చిన ఆదేశాలు.. గ్రామాల్లో ఉన్న జనాభా వివరాల ఆధారంగా రిజర్వేషన్లు కేటాయించినట్లు తెలిపారు. గతంలో ఉన్న ఎన్నికల నిబంధనల ప్రకారమే రిజర్వేషన్లు కల్పించినట్లు పేర్కొన్నారు.

సంగ్రామం 2025





వేములనర్వలో నామినేషన్ కేంద్రం వద్ద ముళ్ల కంచె వేసిన అధికారులు

నామినేషన్ కేంద్రం ఎదుట ముల్ల కంచె

కేశంపేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వేములనర్వ, చింతకుంటపల్లి, కొండారెడ్డిపల్లి గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు మండల పరిధిలోని వేములనర్వ పంచాయతీ భవనంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రంలో నామినేషన్ పత్రాలు దాఖలు చేయాలి. అయితే పంచాయతీ ముందు నుంచి వ్యవసాయ పొలాలకు పోయేదారితోపాటు ఎక్లాస్‌ఖాన్, బైర్కాన్‌పల్లికి వెళ్లే మార్గం ఉంది. నామినేషన్ కేంద్రం ముందు నుంచి కార్లు, పెద్ద వాహనాలు వెళ్లకుండా ఒకవైపు బారికేడ్, మరోవైపు ముళ్లకంచెను ఏర్పాటు చేశారు. దీంతో ఈ మార్గంలో వెళ్లే గ్రామస్తులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

కోడ్ కాలం.. జర పైలం

పంచాయతీ ఎన్నికల వేళ జాగ్రత్తలు తప్పనిసరి

ఎంసీసీ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు.. నిఘా బృందాల ఏర్పాటు



చేవెళ్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసీసీ) అమలులోకి వచ్చింది. అన్ని పార్టీల నాయకులు, పోటీకి సిద్ధమవుతున్న అభ్యర్థులు అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఎన్నికలు జరగనున్న గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు కోడ్ అమలులో ఉంటుందని సంబంధిత ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదయ్యే అవకాశం ఉంటుందని, తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొంటున్నారు.

హద్దు మీరితే అంతే..

ఎన్నికల సమయంలో పోటీ చేసే అభ్యర్థులు, అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులను సమానంగా చూడడంతోపాటు నిబంధనలు మీరకుండా పర్యవేక్షించేందుకు కోడ్ అమలు చేస్తారు. దీని కోసం మండలాల వారీగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సాధారణ ప్రచార సమావేశాలు, ఊరేగింపులు రోజువారీ కార్యకలాపాలు, పార్టీ కార్యక్రమాల పర్యవేక్షణ కోడ్ కిందకు వస్తాయి. ఎవరైన నిబంధనలు మీరితే చర్యలు తీసుకుంటారు.

విధుల్లో నిర్లక్ష్యం వద్దు

ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో మంత్రులు, అధికారిక పర్యటనలను ఎన్నికల ప్రచారంగా వినియోగించకూడదు. ఎన్నికల ప్రచార సమయంలో ప్రభుత్వ వాహనాలు ఉపయోగించొద్దు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు ఎవరైనా వ్యక్తిగత పర్యటనకు వచ్చిన సమయంలో అధికారులను పిలవొద్దు. ప్రజా ప్రతినిధులు పిలిచారని వెళ్లిన అధికారులపై నిబంధనల ఉల్లంఘనల కింద చర్యలు తీసుకుంటారు. అధికారంలో ఉన్న పార్టీలు సంక్షేమ పథకాల ముద్రణ, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రభుత్వ ఖర్చులతో ప్రచారం చేయొద్దు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన ప్రకటనలు, హోర్డింగ్‌లు వెంటనే తొలగించాలి. ఏదైనా పని మంజూరు చేస్తూ ఉత్తర్వులు విడుదలైనా కోడ్ ముగిసే వరకు ప్రారంభించడానికి అనుమతి ఉండదు.

ప్రచారంలో జాగ్రత్తలివి..

ఎన్నికల ప్రచార సమయాన అభ్యర్థులు ప్రస్తుతం ఉన్న విబేధాలను తీవ్రతరం చేయటం, పరస్పర ద్వేషభావాన్ని పెంపొందించేలా వ్యవహరించొద్దు. పరస్పర విమర్శల సమయాన పార్టీ విధానాలకు, కార్యక్రమాలు, గత చరిత్రకు మాత్రమే కట్టుబడి ఉండాలి. నిరాధారమైన ఆరోపణలు చేయకూడదు. ఎన్నికల ప్రచారంలో ప్రార్థనా మందిరాలను వేదికగా చేసుకోవద్దు. లౌడ్ స్పీకర్ల ఉపయోగానికి సైతం అధికారుల నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.



పన్నులు తీసుకుంటున్న పంచాయతీ సిబ్బంది

పంచాయతీలకు జోరుగా ఆదాయం

ఎన్నికల వేళ నోడ్యూస్ కోసం అభ్యర్థుల బకాయిల చెల్లింపు

కొడంగల్ రూరల్, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 27వ తేదీ నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. ఎన్నికల నిబంధనల సర్పంచ్, వార్డుసభ్యులుగా ప్రకారం పోటీచేసే అభ్యర్థులు తప్పనిసరిగా ఇంటి పన్నులు, నీటి పన్నులు, ఇతర పంచాయతీ బకాయిలు పూర్తిగా చెల్లించాల్సి ఉంటుంది. నామినేషన్ పత్రంతోపాటు పంచాయతీ నుంచి పొందిన నోడ్యూస్ సర్టిఫికెట్ జతచేయాల్సి ఉంటుంది. అభ్యర్థులు నోటిఫికేషన్‌తోపాటు గ్రామ పంచాయతీలకు బకాయిలు చెల్లించి నోడ్యూస్ ధ్రువపత్రాలు పొందుతున్నారు. పంచాయతీ సిబ్బంది శుక్రవారం పన్నులు స్వీకరించడంలో బిజీ అయ్యారు. కొడంగల్ మండలంలో 25 పంచాయతీలు ఉండగా అందులో హస్నాబాద్, రుద్రారం, అంగడిరైచూర్, రావులపల్లి నాలుగు మేజర్ పంచాయతీలు ఉన్నాయి.

ఎన్నికలను బహిష్కరించిన 'బడుగోనిబావి'



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బడిగోనిబావి గ్రామస్తులు

దౌల్తాబాద్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): దౌల్తాబాద్ మండలం దేశాయిపల్లి అనుబంధ గ్రామం బడుగోని బావి గ్రామస్తులు పంచాయతీ ఎన్నికలను బహిష్కరించారు. తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని పలుమార్లు రాస్తారోకోలు, ధర్నాలు చేసి నాయకులు, అధికారులకు వినతిపత్రాలు అందించినా ఇప్పటివరకు రోడ్డు సౌకర్యం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం గ్రామ పంచాయతీ పరిధిలోని 8వ వార్డు బడుగోనిబావి ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు దౌల్తాబాద్ తహసీల్దార్ గాయత్రికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొడంగల్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన రేవంత్ రెడ్డి సీఎం హోదాలో ఉన్నా చిన్న సమస్యను పరిష్కరించకపోవడం సరైంది కాదన్నారు. వినతిపత్రం అందించిన వారిలో అనిల్, కృష్ణ, చంద్రప్ప, రవి, శ్రీను, మానప్ప, పాండు, చిన్నయ్య, మైపాల్, రవికుమార్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ కేంద్రాల తనిఖీ

తాండూరు రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గౌతాపూర్ క్లస్టర్ కేంద్రంలో ఎన్నికల ప్రక్రియను ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ చంద్రకిరణ్ పరిశీలించారు. శుక్రవారం గౌతాపూర్ పంచాయతీలో నామినేషన్ల ప్రక్రియను క్లస్టర్ ఇన్‌చార్జి సాయిబన్నను అడిగి తెలుసుకున్నారు. తాండూరు ప్రాంతంలో ఆరు మండలాల్లో పర్యటించానని, ఎన్నికల పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ఎలాంటి తప్పులు జరుగకుండా నామినేషన్ పత్రాలను పరిశీలించిన తర్వాతనే ఎన్నికల అధికారికి అందజేయాలని సూచించారు. ఆయనవెంట తాండూరు ఎంపీడీఓ విశ్వ ప్రసాద్, ఏపీఓ, తదితరులు ఉన్నారు.



నామినేషన్ పత్రాలను పరిశీలిస్తున్న ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ చంద్ర కిరణ్

లింగంధనలో బీసీకి ఒకే ఒక్కటి..



కేశంపేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పకడ్బందీగా కులగణన చేసినా బీసీ రిజర్వేషన్లలో గందరగోళం నెలకొంది. మండలంలోని లింగంధన గ్రామంలో 836 మంది ఓటర్లు ఉండగా, అందులో ఓసీలు 189, బీసీలు 389, ఎస్సీలు 252, ఎస్టీలు ఆరుగురు ఉన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసి రిజర్వేషన్లు ప్రకటించింది. ఇందులో భాగంగా గ్రామంలో సర్పంచ్, ఎనిమిది వార్డులకు రిజర్వేషన్లు కేటాయించింది. సర్పంచ్ పదవి ఎస్సీ జనరల్‌కు కేటాయించగా, వార్డుల్లో 2వ వార్డు ఎస్సీ జనరల్, 4వ వార్డు ఎస్సీ ఉమెన్, 8వ వార్డు ఎస్సీ జనరల్‌కు కేటాయించారు. 3వ వార్డు జనరల్ ఉమెన్, 5వ వార్డు జనరల్ ఉమెన్, 6వది జనరల్, 7వది జనరల్‌కు కేటాయించారు. ఒకటవ వార్డు ఒక్కటే బీసీకి కేటాయించారు. 389 ఓటర్లు ఉంటే ఒక్క బీసీ స్థానం కేటాంచడంపై గ్రామంలోని బీసీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంత పెద్ద సంఖ్యలో బీసీలు ఉంటే ఒక్క స్థానంతో సరిపెట్టారని, ఇది బీసీలకు అన్యాయం చేయడమే ఆరోపిస్తున్నారు.

ట్రావెల్స్ బస్సు, కారు ఢీ

- బస్సులోని 40మంది సురక్షితం

శంకర్‌పల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం మహాలింగపురం వద్ద గురువారం అర్ధరాత్రి ప్రైవేటు ట్రావెల్స్ బస్సు, కారు ఢీకొన్నాయి. ప్రమాద సమయంలో బస్సులో 40మంది ఉండగా ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. లింగంపల్లి నుంచి శంకర్‌పల్లి మీదుగా ఆర్‌సీపురానికి వెళ్తున్న ట్రావెల్స్ బస్సును శంకర్‌పల్లి వైపు నుంచి వస్తున్న కారు ఢీకొంది. దీంతో కారులో మంటలు చెలరేగి ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. కారు డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కారును అతివేగంగా నడపడమే ప్రమాదానికి కారణమని పోలీసులు తెలిపారు.

ఎయిర్‌హోస్టెస్‌తో ప్రయాణికుడి అసభ్య ప్రవర్తన

- నిందితుడిపై కేసు నమోదు

శంషాబాద్ రూరల్, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి): దుబాయ్ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానంలో ఓ ప్రయాణికుడు మద్యం మత్తులో ఎయిర్‌హోస్టెస్‌తో అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో శనివారం ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్‌లో నిందితునిపై కేసు నమోదైంది. దుబాయ్‌లో విమానం టేకాఫ్ తీసుకున్న తర్వాత భారత్‌కు చెందిన బినియమ్ నాజర్ అనే ప్రయాణికుడికి టీ ఇవ్వడానికి వెళ్లిన సమయంలో.. తన చేయి పట్టుకుని అసభ్యంగా ప్రవర్తించాడని బాధితురాలు పైలెట్‌కు సమాచారం అందించారు. విమానం శంషాబాద్‌లో ల్యాండ్ కాగానే భద్రతా సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో.. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ కనకయ్య తెలిపారు.

షూటర్ ధనుష్ శ్రీకాంత్‌కు ఘన స్వాగతం



ధనుష్‌ను సన్మానిస్తున్న అధికారులు

శంషాబాద్ రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): టోక్యోలో జరిగిన బధిర ఒలింపిక్స్‌లో రెండు స్వర్ణాలు సాధించిన హైదరాబాద్ షూటర్ ధనుష్ శ్రీకాంత్‌కు శంషాబాద్ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. శుక్రవారం ఉదయం ఎయిర్‌పోర్టుకు చేరుకున్న అతడికి శాట్ డిప్యూటీ డైరెక్టర్ చంద్రారెడ్డి, గన్ ఫర్ గ్లోరి షూటింగ్ అకాడమీ (జీఎఫ్‌జీ) సిబ్బంది స్వాగతం పలికారు. ధనూష్ తండ్రి శ్రీకాంత్ మాట్లాడుతూ తన కొడుకు ఏళ్ల తరబడి చేస్తున్న కఠోర సాధనకు ఈ పతకాలు నిదర్శనమని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారానికి, జీఎఫ్‌సీలో ధనుష్ శ్రీకాంత్‌కు శిక్షణ ఇచ్చిన కోచ్ నేహాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాట్ కోచ్‌లు గోకుల్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



స్పోర్ట్స్ మీట్‌లో విద్యార్థులు

ఘనంగా పీఎంశ్రీ స్కూళ్ల స్పోర్ట్స్ మీట్

వికారాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సెయింట్ జ్యూడ్స్ స్కూల్‌లో జిల్లా స్థాయి పీఎంశ్రీ స్కూళ్ల స్పోర్ట్స్‌మీట్ ఘనంగా ప్రారంభించారు. జిల్లా స్థాయిలోని 27 పీఎంశ్రీ స్కూళ్ల నుంచి 867 మంది విద్యార్థులు పాల్గొంటుండగా శుక్రవారం పోటీలు ప్రారంభించారు. ఆదివారం వరకు పోటీలు నిర్వహించనున్నారు. ఇందులో ఫుట్‌బాల్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ వంటి జట్టు క్రీడలతో పాటు అథ్లెటిక్స్ విభాగంలో లాంగ్ జంప్, షాట్ పుట్, 100 మీటర్ల రన్నింగ్ పోటీలను నిర్వహిస్తున్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈక్రీడా మహోత్సవంలో జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి, అధికారులు, పీఈటీలు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో క్రీడా చైతన్యం పెంపొందించడంతో పాటు ప్రతిభావంతులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయడం లక్ష్యమని అధికారులు తెలిపారు.

కలెక్టరేట్‌కు ఆర్టీసీ బస్సు

- ప్రజలకు అందని సేవలు

వికారాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజల కోసం నడవాల్సిన ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సును కొంత మంది కలెక్టరేట్ ఉద్యోగుల సౌకర్యార్థం వికారాబాద్ - హైదరాబాద్ మార్గంలో రోజూ నడుపుతున్నారు. దీంతో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం బస్సులు లేక సాధారణ ప్రయాణికులు ఇబ్బందులు పడుతుంటే ప్రత్యేక బస్సులో రోజూ 6 నుంచి 9 మంది మాత్రమే ప్రయాణిస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. ఉదయం హైదరాబాద్ మెహదీపట్నం నుంచి కలెక్టరేట్‌కు వచ్చి సాయంత్రం 5.15కు తిరుగు ప్రాయాణం అవుతుంది. ఈ బస్సు సర్వీసుపై ఆర్టీసీ ఉద్యోగులు అభ్యంతరం వ్యక్తం చేసినా కలెక్టర్ పేరు చెబుతూ ఒత్తిడి తెస్తున్నారని, ముఖ్యంగా ఒక పరిపాలన అధికారి ఆర్టీసీ సిబ్బందిని భయపెడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ స్నేహ మెహ్రా

- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
- వికారాబాద్ ఎస్పీ స్నేహ మెహ్రా

వికారాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఎస్పీ స్నేహ మెహ్రా అన్నారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో పోలీస్ అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలోని 582 పంచాయతీల పరిధిలో 608 పోలీస్ లోకేషన్లలో ఏర్పాటు చేసిన 4,956 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరుగనున్నాయన్నారు. ఎన్నికల ప్రక్రియను ప్రశాంతవాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. విధుల్లో పోలీసులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బి.రాములు నాయక్, డీటీసీ డీఎస్పీ శ్రీనివాస్, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, తాండూరు డీఎస్పీ .యాదయ్య, పరిగి డీఎస్పీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాపరాతి పరిశ్రమ అభివృద్ధికి కృషి

- తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తాండూరు ప్రాంతంలోని నాపరాతి పరిశ్రమపై వేలాది మంది కార్మికులు ఆధారపడి ఉన్నారని, పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. తాండూరులో స్టోన్ మర్చంట్ వెల్ఫేర్ అసోసియేషన్, తాండూరు మండల్ క్వారీ ఓనర్స్ అసోసియేషన్లకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులకు పట్టణంలోని రాయల్ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. తాండూరు స్టోన్ మర్చంట్ వెల్ఫేర్ అధ్యక్షుడిగా ఎంఏ నయీం, కార్యదర్శిగా మీర్జా ఫయాజ్ బేగ్ సంయుక్త కార్యదర్శి సంజీవ్ కుమార్, తాండూరు మండల క్వారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అబ్దుల్ రవూఫ్, కార్యదర్శిగా సయ్యద్ జుబేర్ పాషా, ట్రెజరర్‌గా మహమ్మద్ జైనోద్దీన్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో నాపరాతి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తానని, ఎప్పుడూ తాండూరు ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండి మౌలిక సదుపాయల కల్పనకు పాటుపడతానన్నారు. ఈ కార్యక్రమంలో తాండూరు మైన్స్ ఏడీ సత్యనారాయణ, విద్యుత్ శాఖ ఏడీ శంకర్ నాయక్, నాయకులు డాక్టర్ సంపత్ కుమార్, ఓం ప్రకాష్ సోమని, శరణు బసప్ప, జుబేర్‌లాల, హర్షవర్ధన్‌రెడ్డి, కుంచం మురళి పాల్గొన్నారు.

పాంబండ ఆలయ హుండీ లెక్కింపు

కులకచర్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండవెల్కిచర్ల పాంబండ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. మొత్తం రూ.1,71,536 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఛైర్మన్ మైపాల్ రెడ్డి, ఈవో బాలనర్సయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు ఈవో శాంతకుమార్, అర్చకులు దశరథం, పాండు శర్మ, కమిటీ సభ్యులు, సాంబశివ సేవా సమితి సభ్యులు, మహిళలు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

రెండో రోజూ నామినేషన్ల జోరు


నందిగామ నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో సరిత, ఎంపీడీవో సుమతి

కొత్తూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా రెండో రోజు మండలంలోని వివిధ కేంద్రాల వద్ద నామినేషన్లు వేసేందుకు అభ్యర్థులు భారీగా తరలివచ్చారు. దాంతో పోలీసులు క్యూలైన్‌లో నిలబెట్టి నామినేషన్లు వేయించారు. కొడిచర్ల తండా సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు కేతావత్ స్వప్న తన చిన్నారితో కలిసి వచ్చి నామినేషన్ వేశారు. 12 గ్రామపంచాయతీల గాను రెండోరోజు సర్పంచ్ బరికి 15మంది నామినేషన్లు వేయగా, వార్డుసభ్యుల కోసం 62మంది నామినేషన్లు వేశారు.

కేశంపేట : 29 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లకు.. 35, వార్డు సభ్యులకు.. 100 నామినేషన్లు దాఖలైనట్లు ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి తెలిపారు.

చౌదరిగూడ : 24 గ్రామ పంచాయతీలకు గాను సర్పంచ్ అభ్యర్థులు 18, వార్డు మెంబర్లు 99మంది నామినేషన్లు వేసినట్లు అధికారులు తెలిపారు. అలాగే కొందుర్గు మండలంలో 22 గ్రామ పంచాయతీల్లో 23 సర్పంచ్‌కు, 60 మంది వార్డు మెంబర్లలకు నామినేషన్లు వేసినట్లు ఈ సందర్భంగా అధికారులు తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

షాబాద్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చేవెళ్ల ఏసీపీ కిషన్ తెలిపారు. శుక్రవారం మండలంలోని సమస్యాత్మక, క్లిష్టమైన గ్రామాల్లో ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి, ఎస్సై రమేష్, పోలీస్ బెటాలియన్‌తో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏసీపీ తెలిపారు.


షాబాద్ : రుద్రారంలో పోలీసుల మాక్‌డ్రిల్

బందోబస్తును పరిశీలించిన పోలీసు అధికారులు


కొత్తూర్ : కొడిచర్లతండా సర్పంచ్ అభ్యర్థిగా ఆరు నెలల బాబుతో వచ్చి నామినేషన్ వేస్తున్న కేతావత్ స్వప్న

నందిగామ : 19 గ్రామపంచాయతీలకు గాను సర్పంచులకు 40 మంది, వార్డు సభ్యులకు 24 మంది నామినేషన్లు దాఖలు చేశారు. రెండోరోజు మండలంలో నామినేషన్ల దాఖలు మందకొడిగా కొనసాగాయి.

షాద్‌నగర్ రూరల్ : మండలంలోని 47 గ్రామ పంచాయతీలకు గాను సర్పంచ్.. 34 నామినేషన్లు, వార్డు సభ్యులకు 19 దాఖలయ్యాయి. రెండో జోజు సర్పంచ్‌లకు 55 నామినేషన్లు.. వార్డు సభ్యులకు 138 దరఖాస్తులు వచ్చాయి. కాగా, మొగిలిగిద్ద నామినేషన్ కేంద్రాన్ని శంషాబాద్ డీసీపీ రాజేష్ సందర్శించగా, షాద్‌నగర్ ఆర్డీవో సరిత రాయికల్ కేంద్రంతో పాటు టోల్‌ప్లాజా వద్ద చెక్ పోస్ట్‌ను తనిఖీ చేశారు.

శంషాబాద్ రూరల్ : శంషాబాద్ మండలంలో నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతోంది. ఏడు క్లస్టర్లలో సర్పంచ్ స్థానాలకు 32 నామినేషన్లు, వార్డు సభ్యుల స్థానాలకు 169 నామినేషన్లు దాఖలయ్యాయని ఎంపీడీవో మున్ని తెలిపారు.

పత్రాలు నింపడంలో సూచనలివ్వాలి

యాచారం : నామినేషన్ పత్రాలు నింపడంలో అవసరమైన వారికి సూచనలివ్వాలని, అధికారులు తగిన చొరవ తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి మాధవరావు అన్నారు. యాచారం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణ, నామినేషన్ల స్వీకరణపై రిటర్నింగ్ అధికారులు, క్లస్టర్ అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీడీవో రాధారాణి, ఎంపీవో శ్రీలత, డీటీ కీర్తిసాగర్, సీఐ నందీశ్వర్‌రెడ్డి, ఎస్సైలు మధు, ప్రియాంక తదితరులున్నారు. కాగా, మండలంలో 24 గ్రామ పంచాయతీలు, 20 అనుబంధ గ్రామాలున్నాయి. పది క్లస్టర్లుగా విభజించారు. 232 వార్డులుండగా 50,195 మంది ఓటర్లున్నారు.

ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

ఇబ్రహీంపట్నం : ఎలాంటి వివాదాలకు తావీయకుండా గ్రామ పంచాయతీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి నవీన్ కుమార్‌రెడ్డి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మొత్తం 14 గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు జరుగనున్నాయన్నారు. ఎంపీడీవో వెంకటమ్మ, తహసీల్దార్ సునీతారెడ్డి, మండల పరిషత్ సూపరింటెండెంట్ జంగయ్యగౌడ్, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ పక్కాగా చేపట్టాలి

చౌదరిగూడ : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఏర్పాటు చేసిన చెక్ పోస్టులో వాహనాల తనిఖీ పక్కాగా చేపట్టాలని శంషాబాద్ డీసీపీ రాజేశ్ సూచించారు. శుక్రవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని లాల్‌పహాడ్‌లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును తనిఖీ చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాత్రి సమయాల్లో పోలీస్ పెట్రోలింగ్, చెక్‌పోస్టుల వద్ద బందోబస్తు నిర్వహించాలని సూచించారు. పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే మండల ప్రత్యేకాధికారి వెంక్యానాయక్ మండల పరిధిలోని వనంపల్లి లో ఏర్పాటు చేసిన నామినేషన్ సెంటర్‌ను సందర్శించారు. తహసీల్దార్ జగదీశ్వర్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, షాద్‌నగర్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై విజయ్, సీనియర్ అసిస్టెంట్ మహేందర్‌గౌడ్ ఉన్నారు.

నందిగామ : పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం షాద్‌నగర్ ఆర్డీవో సరిత మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఆర్డీవో సరిత వెంబడి ఎంపీడీవో సుమతి ఉన్నారు. అదేవిధంగా నందిగామ మండలంలోని నందిగామ, వీర్లపల్లి, మామిడిపల్లి, రంగాపూర్, చేగూర్ నామినేషన్ కేంద్రాలను నందిగామ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పరిశీలించారు.

కొత్తూర్ : ప్రశాంత వాతావరణంలో అభ్యర్థులు తమ నామినేషన్లను సమర్పించాలని శంషాబాద్ జోన్ ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్ సూచించారు. మండల పరిధిలోని మల్లాపూర్, గూడూర్ నామినేషన్ కేంద్రాలను ఇన్‌స్పెక్టర్ జి.నర్సయ్యతో కలిసి పరిశీలించారు. ప్రతి ఒక్కరు క్యూ పద్ధతి పాటించి నామినేషన్లను సమర్పించాలని సూచించారు. ఎస్ఐ సత్యాశీలారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

నామినేషన్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు

కేశంపేట : మండలంలోని తొమ్మిది నామినేషన్ సెంటర్ల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ నరహరి వివరించారు. మండలంలోని వేములనర్వ, ఇప్పలపల్లి, పాపిరెడ్డిగూడ, సంగెం, కొత్తపేట, కేశంపేట, నిర్దవెల్లి, తొమ్మిదిరేకుల, అల్వాల నామినేషన్ కేంద్రాలను తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. నామినేషన్ వేసే అభ్యర్థితో పాటు మరో ఇద్దరిని మాత్రమే అనుమతించాలని సూచించారు.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

ఆమనగల్లు : ఎన్నికల నియామవళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని జిల్లా సహాయ ఎన్నికల అధికారి కుసుమ మాధురి అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు మండలంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆమె తెలిపారు. ఆమనగల్లు మండలం మేడిగడ్డ గేటు సమీపంలో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును శుక్రవారం స్థానిక ఏఎస్ఐ రాంరెడ్డితో కలిసి సందర్శించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

14న జరుగనున్న ఎన్నికల నేపథ్యంలో పోలీసు స్టేషన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు ఆమనగల్లు ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు. ప్రజలు, అన్ని పార్టీల నాయకులు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. ఆమనగల్లు పోలీసు స్టేషన్‌లో ఎన్నికల బందోబస్తు వివరాలను వివరించారు.

అభ్యర్థులు బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేయాలి

చేవెళ్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తప్పనిసరిగా జీరో బ్యాలెన్స్ కలిగిన కొత్త బ్యాంకు ఖాతా ఓపెన్ చేసుకోవాలని ఎంపీడీవో హిమబిందు సూచించారు. అధికారుల ఆదేశాలకు అనుగుణంగా రంగారెడ్డి జిల్లాలో ఎక్కడైనా ఏదేని బ్యాంకులో అకౌంట్ తెరవవచ్చని చెప్పారు. జాతీయ బ్యాంకులతో పాటు సహకార బ్యాంకు, పోస్టాఫీస్‌లో కూడా అకౌంట్ తీసుకోవచ్చని సూచించారు. కాగా, అభ్యర్థి ప్రస్తుతం ఉన్న బ్యాంకు అకౌంటును ఎన్నికల అవసరాలకు ఉపయోగించరాదని ఎంపీడీవో సూచించారు.


చౌదరిగూడ: లాల్‌పహాడ్‌లో చెక్ పోస్టు వద్ద వివరాలు తెలుసుకుంటున్న డీసీపీ రాజేశ్

నామినేషన్లకు ఏడు క్లస్టర్ల ఏర్పాటు

కడ్తాల్ : గ్రామ పంచాయతీ ఎన్నికలకు కడ్తాల మండలంలో పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీవో సుజాత తెలిపారు. 24 గ్రామ పంచాయతీలను నామినేషన్ల స్వీకరణ కోసం ఏడు క్లస్టర్లుగా విభజించినట్లు ఆమె తెలిపారు. 24 గ్రామ పంచాయతీల పరిధిలో 210 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేసినట్లు చెప్పారు.


శంషాబాద్ రూరల్ : పెద్దషాపూర్‌లో నామినేషన్ వేసేందుకు వచ్చిన మాజీ సర్పంచ్ సత్యనారాయణగౌడ్

క్రైం కార్నర్

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలు మృతి

శంకర్‌పల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వృద్ధురాలు మృతిచెందింది. సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధి రామంతాపూర్‌నకు చెందిన వడ్ల బాలమణి(60) గురువారం సాయంత్రం శంకర్‌పల్లి పట్టణంలోని ఇంద్రారెడ్డి చౌరస్తాలో రోడ్డు దాటుతుండగా.. హైదరాబాద్ నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఆమెను ఢీకొంది. దాంతో బాలమణి రెండు కాళ్లు, ఎడమ చేతికి బలమైన రక్తగాయాలయ్యాయి. స్థానికులు స్థానిక లలిత ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యులు మెరుగైన చికిత్స నిమిత్తం ఉస్మానియాకు రెఫర్ చేశారు. చికిత్స పొందుతూ బాలమణి గురువారం రాత్రి మృతి చెందింది. ఆమె కుటుంబికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

నల్ల గుంతలోపడి వ్యక్తి ..

కొత్తూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన పట్నం శ్రీశైలం(39) శుక్రవారం ఇంటి ముందు ఉన్న నల్లగుంతలో పడి మృతిచెందాడని ఇన్‌స్పెక్టర్ జి. నర్సయ్య తెలిపారు. ఓ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్న శ్రీశైలం శుక్రవారం విధులకు వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు నల్లగుంతలో పడి ఊపిరాడక మృతిచెందాడు. కుటుంబసభ్యులు శ్రీశైలంను బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడు శ్రీశైలంకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య సంధ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ నర్సయ్య చెప్పారు.

గుండెపోటుతో లారీ డ్రైవర్..

కొత్తూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతిచెందాడు. మండల పరిధిలోని తిమ్మాపూర్ సమీపంలో 44వ జాతీయ రహదారి పక్కన రాజేంద్రప్రసాద్(45) అనే డ్రైవర్ మృతి చెందాడని ఇన్‌స్పెక్టర్ జి. నర్సయ్య చెప్పారు. ఏపీలోని గన్నవరం మండలం కేసరపల్లికి చెందిన రాజేంద్రప్రసాద్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బెంగుళూరు నుంచి హైదరాబాద్‌కు బైక్‌లను కంటైనర్‌లో తీసుకవస్తుండగా గురువారం రాత్రి గుండెనొప్పి రావడంతో తిమ్మాపూర్ సమీపంలో రోడ్డు పక్కన వాహనాన్ని నిలిపాడు. తీవ్ర అస్వస్థతకు గురై లారీలోనే మృతి చెందాడు. తోటి వాహనాల డ్రైవర్లు విషయాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. మృతుడు రాజేంద్రప్రసాద్ భార్య జ్యోత్స్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఎదురెదురుగా రెండు కార్లు ఢీ

- పలువురికి స్వల్ప గాయాలు
- శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఘటన

శంషాబాద్ రూరల్, నవంబర్ 28(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఆర్జీఐఏ ఔట్ పోస్టు పోలీస్ స్టేషన్‌లో ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి 9.55 గంటల సమయంలో టీఎస్ 13యూసీ 4273 నెంబరు గల కారు అదే రూట్‌లో వెళ్తున్న మరో కారు కారు(టీఎస్ 09 జీఏ 5709)ను బలంగా ఢీకొంది. దాంతో కారులో ఉన్న పలువురుకి తీవ్ర గాయాలయ్యాయి. ఎయిర్‌పోర్టు ప్రధాన రోడ్డు కావడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. పోలీసులకు సమాచారం అందడంతో క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం ఇంటికి పంపించారు. పోలీసులు రెండు కార్లను పక్కకు తీసి ట్రాఫిక్ క్లియర్ చేశారు. కాగా, ఎయిర్‌పోర్టుకు వెళ్లాల్సిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. లిఖిత పూర్వక ఫిర్యాదు అందలేదని ఎవరైనా పెడితే కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

ఎయిర్‌పోర్టులో ఇయర్‌బడ్స్ చోరీ

- సీసీ ఫుటేజీలో రికార్డ్.. నిందితుడి గుర్తింపు.. రికవరీ

శంషాబాద్ రూరల్, నవంబర్ 28(ఆంధ్రజ్యోతి): గోవా నుంచి విమానం(ఐసీ 1302)లో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చిన విజయ్ వర్గి అనే ప్రయాణికుడు తన బ్యాగులు బెల్టుపై ఉంచగా.. గాంధీ సర్‌నాగ్ అనే మరో ప్రయాణికుడు అందులో ఉన్న ఇయిర్ బడ్స్(వన్ ప్లస్)ను కొట్టేశాడు. అనంతరం విజయ్ వర్గి తన బ్యాగులు చెక్ చేయగా అందులో ఇయిర్ బడ్స్ కనిపించలేదు. హెల్ప్‌డెస్క్‌కు సమాచారం ఇవ్వగా.. వారు పోలీసులకు తెలిపారు. సీసీ ఫుటేజీని పరిశీలించగా గాంధీ సర్‌నాగ్ తీసుకున్నట్లు స్పష్టంగా రికార్డైంది. ఈమేరకు నిందితుడు దొంగతనం చేసినట్లు చెప్పి ఇయర్‌బడ్స్ ఇచ్చాడు.

'మేరీ హోమ్స్ ఫర్ డిజేబుల్డ్'కు మతిస్థిమితం సరిగాలేని బాలుడి తరలింపు

యాచారం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తక్కళ్లపల్లి గేటు వద్ద శుక్రవారం సాయంత్రం పోలీసులు మతిస్థిమితం సరిగాలేని సుమారు 12 నుంచి 14 ఏళ్ల వయసున్న బాలుడిని గుర్తించారు. కాగా, అతడికి మాటలు రాకపోగా మతిస్థిమితం కూడా సరిగా లేదని వారు తెలిపారు. తక్కళ్లపల్లి గేటు వద్ద సంచరిస్తుండగా పెట్రోమొబైల్ పోలీసులు అతడిని యాచారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సికింద్రాబాద్‌లోని మేరీ హోమ్స్ ఫర్ డిజేబుల్డ్ సెంటర్‌లో చేర్పించారు. బాలుడి ఆచూకీ కొరకు 87126-62757 నెంబర్‌ను సంప్రదించాలని సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు.


గుర్తు తెలియని బాలుడు

ఎన్‌హెచ్ఆర్‌సీ డిబేట్ కాంపిటీషన్‌లో ఎయిర్‌పోర్టు సీఐఎస్ఎఫ్ సిబ్బంది ప్రతిభ

శంషాబాద్ రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలోని అటల్ ఉర్జా భవన్‌లో గురువారం నిర్వహించిన ఎన్‌హెచ్ఆర్‌సీ డిబేట్ కాంపిటీషన్‌లో వరుసగా 12వ సారి సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్) ట్రోఫీ గెల్చుకుంది. ఇందులో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు సంబంధించిన సీఐఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొని ప్రతిభ కనబర్చారు. సీఐఎస్ఎఫ్ 12వ సారి ట్రోఫీ గెల్చుకోవడం సంతోషంగా ఉందని అధికారులు తెలిపారు. జాతీయ మానవ హక్కుల కమిషన్‌తో పాటు వివిధ ప్రభుత్వ సంస్థలకు చెందిన సీనియర్ అధికారుల సమక్షంలో పోటీలు జరిగాయి. గెలుపొందిన బృందానికి ఎన్‌హెచ్ఆర్‌సీ చైర్‌పర్సన్ జస్టిస్ రామసుబ్రమణియన్ కప్ అందజేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

'బీఆర్ఎస్' అభ్యర్థులను గెలిపించుకోవాలి

మొయినాబాద్ రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మద్దతు తెలిపిన అభ్యర్థులను అధిక మెజారిటీతో గెలిపించుకోవాలని రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండలంలోని సజ్జన్‌పల్లి గ్రామానికి చెందిన పలువురు నాయకులు శుక్రవారం అనంతరెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కత్తుల కృష్ణ, నర్సింహులు తదితరులు పార్టీలో చేరారు. మండలాధ్యక్షుడు వెంకటరెడ్డి, నర్సింహారెడ్డి, మిథున్ కుమార్, శ్రీకాంత్ యాదవ్, నవీన్‌యాదవ్, చంద్రశేఖర్‌రెడ్డి, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

చేవెళ్ల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంఈవో పురందాస్ తెలిపారు. శుక్రవారం చేవెళ్ల వేదికగా ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఎల్టా తెలంగాణ ఇంగ్లీష్ ఒలంపియాడ్ అండ్ ఎడ్యుకేషన్ జిల్లాస్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఆలూర్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. మండల స్థాయిలో భరత్‌కుమార్ మొదటి బహుమతి సాధించడం అభినందనీయమన్నారు. హెచ్ఎం లీలారాణి, వీరప్ప, టీచర్లు ఉన్నారు.

ప్రజలను జాగృతం చేయాలి

- పంచాయతీ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు కైవసం చేసుకోవాలి
- మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మంచిరెడ్డి

మంచాల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలను జాగృతం చేయాలని మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి బీఆర్ఎస్ శ్రేణులకు సూచించారు. మంచాలలో శుక్రవారం నిర్వహించిన గ్రామపంచాయతీ ఎన్నికల బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని, సీఎం రేవంత్‌రెడ్డి బీసీలకు తీరని అన్యాయం ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యేకు ఈ ప్రాంతంపై కనీస అవగాహన లేదని విమర్శించారు. పంచాయతీ ఎన్నికలను రాజకీయ ఎదుగుదలకు మొదటిమెట్టుగా భావించాలని యువతకు సూచించారు. అనునిత్యం ప్రజల్లో ఉంటూ బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనపై తేడాను వివరించాలన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు కైవసం చేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమాలపై ప్రశ్నించే గొంతుకలుగా మారాలన్నారు. బీఆర్ఎస్ రాష్ట్రనేత క్యామ మల్లేష్, మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రమేష్, బహదూర్, పీఏసీఎస్ మాజీ చైర్మన్లు సికిందర్‌రెడ్డి, పుల్లారెడ్డి, రవి, చంద్రయ్య, కిషన్‌రెడ్డి, వెంకటేష్, శంకర్, నర్సింగ్ అనిత, పి.సుకన్య, చంద్రకాంత్, బీఎన్. సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వీరేంద్రుడి సేవలు చిరస్మరణీయం


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి తదితరులు

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్, తెలంగాణ ఉద్యమకారుడు తాండ్ర వీరేందర్‌రెడ్డి చేసిన సామాజిక సేవలు మరువలేనివని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్‌లోని కేఎస్ఆర్ గార్డెన్‌లో శుక్రవారం వీరేందర్‌రెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమం తాండ్ర విశాల శ్రవణ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే శంకర్‌తో పాటు పార్టీలకు అతీతంగా నాయకులు, బంధువులు హాజరై వీరేందర్‌రెడ్డి చిత్రపటంపై పూలువేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యావేత్తగా, సర్పంచ్‌గా పాపిరెడ్డిగూడ గ్రామంలో విద్యాభివృద్ధికి కృషి చేసి, న్యాయవాదిగా, లయనిస్టుగా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వీరేందర్‌రెడ్డి ఎనలేని సామాజిక సేవలు అందించారని అన్నారు. మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు వై. అంజయ్యయాదవ్, బీష్వ కిష్టయ్య, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ నరేందర్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు ఎం.శ్యాంసుందర్‌రెడ్డి, పి.వెంకట్‌రాంరెడ్డి, షాద్‌నగర్ గ్రంథాలయ కమిటీ చైర్మన్ కొప్పుల మధన్‌మోహన్‌రెడ్డి తదితరులున్నారు.

రాష్ట్రస్థాయి చెకుముఖి పోటీలకు అరబిందో, ఇర్విన్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు

ఆమనగల్లు/మాడ్గుల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి చెకుముఖి పోటీలకు ఆమనగల్లు పట్టణంలోని అరబిందో పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. మండల స్థాయిలో నిర్వహించిన పోటీలలో ప్రతిభ కనబరిచారు. శుక్రవారం శివరామ్‌పల్లి జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. కరీంనగర్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు చరణ్, వంశీ శివ, రాకేశ్‌లు ఎంపికవ్వగా పాఠశాల నిర్వాహకులు, ఉపాధ్యాయులు వారిని పాఠశాలలో సత్కరించి అభినందించారు. అలాగే మండల స్థాయి చెకుముఖి పోటీల్లో ప్రతిభ చాటిన ఇర్విన్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు సూదిని నచికేతన్‌రెడ్డి, ఆకుతోట శివకుమార్, మధులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం లండం పర్వతాలు తెలిపారు. ఈమేరకు వారిని ఉపాధ్యాయులతో కలిసి ఆయన అభినందించారు.

హామీలను అమలు చేయాలి

చేవెళ్ల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని ఉద్యమకారుల పోరాటం చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి యాలాల మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడి 12 సంవత్సరాలైనా ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుందని, కాంగ్రెస్ అధికారంలో వచ్చి రెండేళ్లు పూర్తవుతున్నా హామీలను అమలుచేయడం లేదన్నారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్ సౌకర్యం కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి అమలు చేయాలని కోరారు.

పంచాయతీకి 'రియల్' పోరు

(ఐదో పేజీ తరువాయి)

ఈ సారి సర్పంచ్ స్థానానికి పోటీ చేసేందుకు యువకులు, వ్యాపారులు ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో చాలామంది నగరంలో ఉండే నేతలు వారి గ్రామాల సర్పంచ్ కుర్చీ కోసం ఆరాట పడుతున్నారు. శ్రీశైలం - హైదరాబాద్ జాతీయ రహదారి సమీప గ్రామాల పంచాయతీలలో సర్పంచ్ ఎన్నికలపై రియల్ ఎస్టేట్ ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. నామినేషన్ల పర్వం ప్రారంభం కాకముందే ఎన్నికల బరిలో నిలిచే వారు ప్రచారంలోకి దిగి ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు పోటాపోటీగా ఖర్చు పెడుతున్నారు. ఇప్పటికే పోటీకి నిర్ణయించుకున్న ఆశావహులు కొన్ని చోట్ల లక్షల రూపాయలు ఖర్చు చేసినట్లు సమాచారం. అప్పుడే విందులు మొదలైనట్లు తెలిసింది. అయితే ఎన్నికల కమిషన్ వ్యయ పరిమితిని విధించింది. 5వేల లోపు జనాభా ఉన్న గ్రామ పంచాయతీకి రూ.1.50 లక్షలు, అంతకు ఎక్కువగా జనాభా ఉన్న జీపీకి రూ. 2.50 లక్షలు ఖర్చు పరిమితిగా నిర్ణయించింది. కాగా, పెద్ద గ్రామాలలో అభ్యర్థిత్వం కోసం ఆశావహులు ఇప్పటికే మద్దతు కూడగట్టుకోవడానికి కొందరు రూ.లక్షల్లో ఖర్చు చేసినట్లు సమాచారం. సర్పంచ్, వార్డు సభ్యుల పదవులు అధిరోహించేందుకు కొందరు నాయకులు ఎన్నికల ఖర్చు కోసం సొంత ఆస్తులను తాకట్టు పెట్టడం, ఉన్నదాంట్లో కొంత అమ్ముకోవడానికి సిద్ధమవుతున్నట్లు తెలిసింది. కొందరు నాయకులు గ్రామాలలో ఏళ్లకాలంగా ప్రజలను అంటిపెట్టుకొని, వారి సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేశారు. కాగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు, నగరంలో ఉంటూ వ్యాపారాలు చేసుకునే యువకులు సర్పంచ్ గిరి కోసం పల్లెబాట పట్టడంతో వారి ధన ప్రభావం ముందు స్థానికంగా ఉన్న నేతల ప్రజాభిమానం క్రమంగా తరిగిపోతోంది. రాష్ట్ర రాజధాని సమీపంలో ఉన్న ఈ ప్రాంతంలో గత కొంత కాలంగా భూముల ధరలు ఆకాశన్నంటాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం మారుమూల పల్లెలకు విస్తరించింది. దీంతో కొన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లకు, వార్డు సభ్యులకు మంచి ఆదాయం ఒనరుగా మారింది. అదేవిధంగా గతంలో సాదాసీదా జీవితం గడిపిన కొందరు సర్పంచ్‌లై ఆర్థికంగా బాగా ఎదిగారు. హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ఈ నేపథ్యంలో సర్పంచ్ పదవి వరిస్తే తాముకూడా ఆర్థికంగా బలపడుతామనే ఆలోచనతో చాలా మంది యువకులు, వ్యాపారులు, ద్వితీయశ్రేణి నాయకులు పంచాయతీ ఎన్నికల బరిలోకి దిగేందుకు సిద్ధమవుతున్నారు. కడ్తాలలో సర్పంచ్ గిరికి రూ.3 కోట్ల వరకు ఖర్చయ్యే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. మైసిగండి తోపాటు నాలుగు మండలాల పరిధిలోని అనేక గ్రామాలలో ఇదే పరిస్థితి కనిపిస్తుంది. రిజర్వుడ్ స్థానాలలో కూడా రియల్ ఎస్టేట్, ధన ప్రభావం సర్పంచ్ ఎన్నికలపై కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. ఏది ఏమైనా పంచాయతీ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారాయి.

గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే

- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


షాద్‌నగర్ : పూలే వర్ధంతిలో ఎమ్మెల్యే శంకర్ తదితరులు

షాద్‌నగర్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల్లో వెలుగులు నింపిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కొనియాడారు. పూలే వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం సమీపంలోని ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయ జేఏసీ నేతలతో పాటు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రఘునాయక్, చెందితిరుపతిరెడ్డి, ముబారక్ పాల్గొన్నారు.

కందుకూరు : జ్యోతిరావు పూలేను యువత ఆదర్శంగా తీసుకొని ముందుకుసాగాలని బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎగ్గిడి సత్తయ్య పిలుపునిచ్చారు. ఆ సంఘం మండల శాఖ అధ్యక్షుడు బండ ఆంజనేయులు ఆధ్వర్యంలో కందుకూరు గ్రామంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. నాయకులు టి.శ్రీనివాస్, రవీందర్‌గౌడ్, ఎ.శ్రీనివాస్, కె.సురేందర్, వరుణ్, శ్రీశైలం, కె.నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ : జాతి జాగృతికి, బడుగు బలహీన వర్గాల ఉద్ధరణకు జీవితాన్ని అంకితం చేసిన మహాత్మ జ్యోతిరావు పూలే మార్గం అందరికీ స్ఫూర్తిదాయకమని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూ రు శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డిలు అన్నారు. కడ్తాల మండల కేంద్రంలో జ్యోతిరావు పూలే వర్ధంతిని శుక్రవారం కాంగ్రెస్ పార్టీ, బీసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించగా.. ప్రజాప్రతినిధులు, నాయకులు, బీసీ సంఘం నేతలు, పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. చేగూరి వెంకటేష్, బీచ్యనాయక్, మల్లేశ్‌గౌడ్, సత్యం యాదవ్, తదితరులు పాల్గొన్నారు.


చేవెళ్ల : నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

తలకొండపల్లి : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో జ్యోతిరావు పూలే చిత్రపటాలకు నివాళులర్పించారు. చెన్నయ్య, రేణురెడ్డి, డేవిడ్, అంజయ్య, దైవానందం, సాయిలు, రాంచందర్, తదితరులు న్నారు.

చేవెళ్ల : బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి జ్యోతిరావు పూలే చేసిన సేవలు మరువలేనివని బీజేపీ చేవెళ్ల మున్సిపాలిటీ అధ్యక్షుడు అనంతరెడ్డి తెలిపారు. మున్సిపల్ కేంద్రంలో బీజేపీ నాయకులతో కలిసి పూలే విగ్రహానికి నివాళుర్పించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ వెంకటరంగారెడ్డి, మాజీ సర్పంచ్ మాణిక్యరెడ్డి, సీనియర్ నాయకులు శ్రీనివాస్‌గుప్తా, శర్వలింగం, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు ప్రవీణ్ ఉన్నారు.

శంకర్‌పల్లి/షాబాద్ : పూలే సేవలు మరువలేనివని శంకర్‌పల్లి ఏఎంసీ వైస్‌చైర్మన్ కాశెట్టి చంద్రమోహన్ తెలిపారు. శంకర్‌పల్లిలోని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు వడ్డే నర్సింలు, రాజేశ్వర్‌గౌడ్, రఘునందన్‌రెడ్డి. ఉపాధ్యాయుడు ప్రేమ్‌కుమార్ తదితరులున్నారు. అలాగే పూలే వర్ధంతిని పురస్కరించుకొని షాబాద్‌లో ఆయన విగ్రహానికి పలువురు నాయకులు నివాళుర్పించారు.